


Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4784

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS irspublications12@gmail.com

నంద్యాల | సంపుటి: 02 | సంచిక : 10 | మంగళవారం 18 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## బీహార్ ఆలయంలో తొక్కిసలాట

- ఏడుగురి మృతి..10 మందికి గాయాలు..
- బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి విచారం
- మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటన



పాట్నా - సూర్య వాస్తవం

బీహార్‌లోని ఓ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందారు. 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన లఖిసరాయి పట్టణంలోని అశోక్ ధామ్ ఆలయంలో సోమవారం ఉదయం 6:40 గంటల సమయంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. శ్రావణమాసం సోమవారం సందర్భంగా ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రద్దీకి తగినట్లుగా ఆలయాధికారులు ఏర్పాట్లు చేయకపోవడం, విద్యుత్ స్తంభం విరిగిపోయిందనే వదంతుల కారణంగా ఆలయంలో తొక్కిసలాట జరిగినట్లు స్థానికులు

- మిగతా 2లో..

## వామపక్ష విద్యార్థి సంఘాల మార్చ్ ఉద్రిక్తం

- ఎన్టీఏ ప్రధాన కార్యాలయం వద్ద విద్యార్థుల ఆందోళన
- ఢిల్లీ పోలీసుల దాడి, అరెస్టు
- బలవంతంగా వాహనంలో ఎక్కించిన పోలీసులు
- పలువురికి గాయాలు
- ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశంలోని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నేతృత్వంలోని వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించిన మార్చ్ ఉద్రిక్తంగా మారింది. వందలాది మంది విద్యార్థులతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రధాన కార్యాలయానికి మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు దాడి చేశాయి. నిరసన తెలుపుతున్న విద్యార్థులను అరెస్టు చేసి అక్కడినుంచి బలవంతంగా తీసుకెళ్లి పోలీసు వాహనంలోకి ఎక్కించారు. ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెహినా ఫాతిమా, రాష్ట్ర కమిటీ సభ్యురాలు

- మిగతా 3లో..



### కర్ణాటకకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు..

## విజయ్ ప్రభుత్వానికి ఊరట

- తమకు రావలసిన నీటి వాటా అందడం లేదని తమిళనాడు ప్రభుత్వం పిటిషన్
- ప్రస్తుతం 12,000 క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపిన కర్ణాటక
- పరిస్థితిని సమీక్షిస్తామని పేర్కొన్న ధర్మాసనం
- కావేరి జలాల విడుదలలో సీడబ్ల్యూఎంఏ ఆదేశాలను పాటించాలన్న సుప్రీంకోర్టు
- తదుపరి విచారణ ఆగస్టు 24వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కావేరి నదీ జలాలను తమిళనాడుకు విడుదల చేసే అంశంలో కావేరి నీటి నిర్వహణ ప్రాధికార సంస్థ (సీడబ్ల్యూఎంఏ) జారీ చేసిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని కర్ణాటక

- మిగతా 3లో..

### తప్పు ఎన్టీఏది..

# శిక్ష విద్యార్థులకా?

- జీసీ పునఃపరీక్షలపై రాహుల్ గాంధీ ఫైర్
- విద్యార్థుల సమయం, డబ్బు వృథా
- మానసిక ఒత్తిడికి బాధ్యులెవరు?
- మోదీ సమాధానం చెప్పే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం
- విద్యార్థుల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టీకరణ



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

జీసీ- ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు మరోసారి పరీక్ష నిర్వహించాలన్న జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. పరీక్షలకు నెలల తరబడి సిద్ధమై, ఇప్పటికే పరీక్షలు రాసిన వేలాది మంది అభ్యర్థులు.. ఎన్టీఏ వైఫల్యాల కారణంగా మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి రావడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'మోదీజీ.. మీ ఎన్టీఏ ఏం చేసిందో చూడండి.

జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్,

- మిగతా 2లో..



## సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి ఊరట

హైదరాబాద్ - సూర్య వాస్తవం

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో మధ్యంతర ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలకు సంబంధించిన కేసులో ప్రస్తుతం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, అలహాబాద్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు జడీ×, జుణ ఎలాంటి నివేదికను సమర్పించకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

- మిగతా 2లో..

### డీఎస్సీ నియామకాల్లో

# డీవియేషన్ లేదు..

- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి: వైసీపీకి చంద్రబాబు సవాల్
- మెగా డీఎస్సీ నియామకాల్లో అంతా పారదర్శకమేనన్న సీఎం చంద్రబాబు - అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం
- డీఎస్సీపై వైసీపీది హిట్ అండ్ రన్ తరహా దుష్ప్రచారం అంటూ ఫైర్
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ప్రతిపక్షానికి సవాల్
- 148 రోజుల్లో 15,941 ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామని వెల్లడి
- అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారని విమర్శ



అమరావతి- సూర్య వాస్తవం

మెగా డీఎస్సీ నియామకాల్లో ఒక్క డీవియేషన్ కూడా జరగలేదని, ప్రతిభ ఆధారంగానే అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై వైసీపీ చేస్తున్నది కేవలం హిట్ అండ్ రన్ ఆరోపణలేనని, వారికి దమ్ము, ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వృద్ధులతో ఫేక్ ప్రదర్శనలు చేయిస్తూ డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.

**విద్యాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది**

విద్యార్థులకు మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే వారే అత్యుత్తమ మానవ వనరులుగా తయారవుతారని తమ ప్రభుత్వం

- మిగతా 2లో..

# పేదల ఆరోగ్యం మా బాధ్యత

- విద్యావైద్యరంగాలకు ప్రాధాన్యతిస్తున్నాం
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కోసమే రూ.5,226 కోట్లు ఖర్చుచేశాం
- వైద్యారోగ్య శాఖకు రూ.21,800 వెచ్చించాం
- టెంకాయలు కొట్టి వదిలేసినోళ్లు టిమ్స్ కట్టామని గొప్పలా
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు
- సమయం పనిచేసే డాక్టర్లకు ప్రోత్సాహకాలివ్వండి
- డాక్టర్ మర్రిచెన్నారెడ్డి టిమ్స్ పారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్- సూర్య వాస్తవం

పేదల వైద్యానికి ప్రాధాన్యమిస్తున్నామనీ, వారి ఆరోగ్యం తమ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్యావైద్య రంగాల కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ లో నూతనంగా నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఆరోగ్యదీపిక పాలిక్లినిక్‌లను ప్రారంభించారు. సురక్షితమైన ఆహారం, నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యంగా టీసేఫ్ వ్యవస్థను ప్రారంభించారు. పలువురు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### అసెంబ్లీలో అడుగుపెట్టిన ప్రశాంత్ కిషోర్..

# ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం

- బంకిపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన ప్రశాంత్ కిషోర్
- స్పీకర్ ఛాంబర్‌లో పీకేతో ప్రమాణం చేయించిన ప్రేమ్ కుమార్
- ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థిపై 19,246 ఓట్ల మెజార్టీతో విజయం
- రెండు మూడు నెలల్లోనే నియోజకవర్గంలో మార్పు చూపిస్తానని హామీ
- తదుపరి ఎమ్మెల్సీ, పంచాయతీ ఎన్నికలపై జన సురాజ్ పార్టీ దృష్టి

2లో



# బీహార్ ఆలయంలో తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపిస్తున్నారు. శ్రావణ మాసంలో హిందువులు పవిత్రమైనదిగా భావించే సోమవారం రోజున, అధిక రద్దీతో కూడిన రెండు రైళ్లు ఒకే సమయానికి లఖిసరాయ్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాయనీ, వీరిలో ఎక్కువ మంది మహిళలేనని, వీరంతా పవిత్ర జలాన్ని సమర్పించడానికి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఆలయం వద్దకు ఒకే సారి చేరుకున్నారని ఒక ప్రత్యక్ష సాక్షి తెలిపారు. దీన్ని గుర్తించినా అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. ఈ రద్దీ సమయంలో జరిగిన గందరగోళానికి వెదరుతో ఏర్పాటు చేసిన బారికేడ్ కూలిపోయిందని చెప్పారు. అదే సమయంలో సమీపంలో ఉన్న పొలంలో ఒక విద్యుత్ స్తంభం విరిగిపడింది. దీంతో వెనుక నుంచి వస్తున్న కొందరు విద్యుత్ స్తంభం కూలిపోయిందని బిగ్గరగా అరవడం ప్రారంభించారు. దీంతో క్యూలైన్లలో తొక్కిసలాట ప్రారంభమైంది. కొంత మంది కిందపడిపోయారు. వెనుక ఉన్న వారు వారిని తొక్కుకుంటూ వెళ్లడంతో ప్రాణనష్టం జరిగింది. గాయపడిన వారిని లఖిసరాయ్ సదర్ (టౌన్) ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల్లో ఆరుగురిని గుర్తించారు. బరహియాకు చెందిన మన్మలా దేవి (44), సోని దేవి (50), ముంగేర్‌లోని సఫియా సరాయ్‌కు చెందిన రింకు దేవి (50), హల్సిలోని కైంది ప్రతాప్‌పూర్‌కు చెందిన హేమలతా దేవి (55), హల్సి ప్రతాప్‌పూర్‌కు చెందిన లలితా దేవి (45), సంగీతా దేవి (40)గా గుర్తించారు. మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తొక్కిసలాటపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని అధికారులు తెలిపారు.

**ఈ ఘటన అత్యంత విచారకరం : సీఎం సామ్రాట్ చౌదరి**

ఆలయంలో తొక్కిసలాట ఘటనపై బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి విచారం వ్యక్తం చేశారు. 'ఇది అత్యంత విచారకరం, హృదయ విదారకం' అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 4 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, ఆర్‌జేడీ నాయకులు తేజస్వీ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. సరైన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడమే ఈ ఘటనకు కారణమని విమర్శించారు. ఇది ఎన్డీఏ ప్రభుత్వ 'పరిపాలనా వైఫల్యాన్ని' ప్రతిబింబిస్తోందని ఆరోపించారు.

# వామపక్ష విద్యార్థి సంఘాల మార్చ్ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

శరణ్య వర్మలను పోలీసులు ఈడ్చుకెళ్లారు. విద్యార్థినులని కూడా చూడకుండా మగ పోలీసులు వారిపై దాడికి పాల్పడ్డారు. అంతేకాక విద్యార్థినుల మెడలు పట్టుకుని ఊపిరి ఆడకుండా చేశారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ మార్చ్ కు ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి సూరజ్ ఇలామన్, అధ్యక్షురాలు నాడియా నాయకత్వం వహించారు. ఏఐఎస్ఎఫ్, దిశ, ఎఐఎస్ఒ, ఎఐఎస్ఎ సంఘాలూ ఈ మార్చ్‌లో పాల్గొన్నాయి. వీరిని ఎన్టీఏ ప్రధాన కార్యాలయం నుంచి తొలగించడానికి పోలీసులకు, కేంద్ర బలగాలకు రెండు గంటలకు పైగానే సమయం పట్టింది. పదేపదే పరీక్షలలో విఫలమ వుతున్న ఎన్టీఏను రద్దు చేయాలని, పునఃపరీక్షలు జరుగుతున్న సబ్జెక్టులకు రీఫండ్‌లు ఇవ్వాలని, పునఃపరీక్షలలో పరీక్షా కేంద్రాలను మార్చుకునేందుకు అనుమతించాలని, పునఃపరీక్షల కారణంగా పీహెచ్‌డి ప్రవేశాలు, ఫెలోషిప్‌లు, ఇతర విద్యా అవకాశాలలో జాప్యం జరగకూడదని, పరీక్షలలోని అవకతవకలపై స్వతంత్ర విచారణ జరపాలని ఈ సందర్భంగా విద్యార్థులు డిమాండ్ చేశారు.

# కర్ణాటకకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు.. విజయ్ ప్రభుత్వానికి ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ వివాదంపై తదుపరి విచారణను ఆగస్టు 24వ తేదీకి వాయిదా వేసింది. తమకు కేటాయించిన నీటి వాటాను కర్ణాటక సక్రమంగా విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కర్ణాటక రిజర్వాయర్లలో తగినంత నీరు ఉన్నప్పటికీ, సీడబ్ల్యూఎంఏ ఆదేశాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని తమిళనాడు తరఫు న్యాయవాదులు ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తాము ఇప్పటికే నీటి విడుదలను పెంచామని, సోమవారం ఉదయం నాటికి 12,000 క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తున్నామని కర్ణాటక ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నప్పటికీ, గణనీయమైన స్థాయిలో నీటిని వదులుతున్నట్లు వివరించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, కర్ణాటక ప్రభుత్వం నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేయలేదని అభిప్రాయపడింది. ఈ పరిస్థితులను తాము నిశితంగా పర్యవేక్షిస్తామని పేర్కొంటూ, నీటి విడుదలకు సంబంధించిన తాజా నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఈలోగా సీడబ్ల్యూఎంఏ ఆదేశాలను కచ్చితంగా అనుసరించాలని కర్ణాటకకు స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది. కావేరి ట్రైబ్యునల్ అవార్డు, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఇరు రాష్ట్రాల మధ్య జలాల పంపిణీని సీడబ్ల్యూఎంఏ పర్యవేక్షిస్తోంది.

# సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జరిగే వరకు అలహాబాద్ హైకోర్టు తన తదుపరి విచారణను వాయిదా వేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు జదీ×, జుణ ఎలాంటి నివేదికను సమర్పించకూడదని కూడా పేర్కొంది. ఈ కేసులో కర్ణాటకకు చెందిన ఎస్. విఘ్నేశ్ శిశిర్, అలాగే జదీ×, జుణలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

**అసెంబ్లీలో అడుగుపెట్టిన ప్రశాంత్ కిషోర్..**

# ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

జన సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈరోజు ఆయన బంకిపుర్ అసెంబ్లీ నియోజకవర్గ నూతన శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. బీహార్ అసెంబ్లీ స్పీకర్ ప్రేమ్ కుమార్ తన ఛాంబర్‌లో ప్రశాంత్ కిషోర్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి జన సురాజ్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరగడం లేదు. వర్షాకాల సమావేశాలు ఇప్పటికే ముగియగా, శీతాకాల సమావేశాలకు ఇంకా సమయం ఉంది. ఈ నేపథ్యంలో స్పీకర్ తన ఛాంబర్‌లోనే నూతన సభ్యుడితో ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారంతో ప్రశాంత్ కిషోర్ శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు అధికారికంగా అర్హత సాధించారు. జులై 30న జరిగిన బంకిపుర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్.. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై 19,246 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికలో ఆర్జేడీ అభ్యర్థి మూడో స్థానానికి పరిమితమై డిపాజిట్ కోల్పోయిన విషయం తెలిసిందే. గెలిచిన అనంతరం పీకే, రాబోయే రెండు మూడు నెలల్లోనే తన నియోజకవర్గంలో స్పష్టమైన మార్పు చూపిస్తానని హామీ ఇచ్చారు. 10,000 మంది యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి, పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో విద్య, రేషన్ కార్డుల వ్యవస్థ మెరుగుదల, 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.1,100 పింఛను వంటి కీలక హామీలను ప్రకటించారు. కేవలం బంకిపుర్‌కే పరిమితం కాకుండా త్వరలో జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికలపైనా జన సురాజ్ పార్టీ దృష్టి సారిస్తోంది. పార్టీ విస్తరణలో భాగంగా పీకే త్వరలో మరోసారి రాష్ట్రవ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# తప్పు ఎన్‌టీఏది.. శిక్ష విద్యార్థులకా?

(మొదటిపేజీ తరువాయి)

కామర్స్ జీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**దోపిడీ యంత్రంగా పరీక్షల వ్యవస్థ!**

పరీక్షల వ్యవస్థను విద్యార్థులను దోపిడీ చేసే యంత్రంగా మార్చారని రాహుల్ ఆరోపించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వ హించేందుకు దేశంలో సరైన వ్యవస్థ లేదని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యావ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మారింది' అని విమర్శించారు. జీసీ-నెట్ ప్రశ్నపత్రాలు పరీక్షకు ముందే లీకయ్యాయా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు ఎన్‌టీఏ ఎందుకు సమాధానం చెప్పడంలేదని ప్రశ్నించారు.

**పరీక్షలు సరిగా నిర్వహించలేని వ్యవస్థ ఎందుకు?**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనని, ఎన్‌టీఏ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న ప్రతి విద్యార్థికి చెబుతున్నా. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పరీక్షలు నిర్వహించలేని వ్యవస్థను నిర్మించిందని విమర్శించారు. ఆ వ్యవస్థ చేసిన తప్పులకు విద్యార్థులనే బాధ్యులుగా చేస్తోంది. మీ విలువైన సంవత్సరాలు వృథా అవుతున్నాయి. దీనిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటాం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## డీఎస్సీ నియామకాల్లో

# డీవియేషన్ లేదు..

(మొదటిపేజీ తరువాయి)

విశ్వసిస్తుందని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, మహిళా యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, మండలానికి ఓ జూనియర్ కాలేజీ, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. 2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయని పాలకులు, విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు 14 డీఎస్సీలు జరిగితే, వాటిలో 11 డీఎస్సీలను టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్వహించి, అవినీతికి ఆస్కారం లేకుండా నియామకాలు చేపట్టామని వివరించారు.

**148 రోజుల్లోనే పారదర్శకంగా నియామకాలు**

గత పాలకులు ఐదేళ్లలో చేయలేని పనిని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను కేవలం 148 రోజుల్లోనే పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియ వరకు అన్నీ కట్టుదిట్టంగా చేపట్టామన్నారు. 13 సబ్జెక్టులకు 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేశామని, నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

**వైసీపీవి ఫేక్ ఆందోళనలు, కుట్రలు**

డీఎస్సీపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. "గొడ్డలి పార్టీ నేతలు ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్‌జీ వ్యక్తులతో ఫేక్ ధర్నాలు చేయిస్తున్నారు. ప్రభుత్వంలో పనిచేసి రిటైరైన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. వైసీపీ ఆరోపణలను సహించలేకే డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన టీచర్లే స్వయంగా రోడ్లపైకి వస్తున్నారని, మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో భారీగా ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. "పిల్లలకు పాఠాలు చెబుతాం.. మా ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతాం" అని వారు నినదించిన విషయాన్ని చంద్రబాబు సభ దృష్టికి తెచ్చారు.

**అసెంబ్లీకి రాకుండా పబ్జీలా?**

తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, కుట్రలు చేసే పార్టీలకు కాదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. అడ్డంగా దొరికిపోతామనే భయంతో వారు సభకు రావడం లేదు. సిగ్గులేని ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. రెండున్నరేళ్లుగా సభకు రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. నా జీవితంలో ఇలాంటి పార్టీని చూడలేదు" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ప్రజల పట్ల పూర్తి బాధ్యత ఉందని, రాష్ట్రంలో ఎలాంటి కుట్రలు పనిచేయవని, ఉపాధ్యాయ నియామకాలు అత్యంత జవాబుదారీతనంతో జరిగాయని సీఎం పునరుద్ఘాటించారు.

# పేదల ఆరోగ్యం మా బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయనీ, ఆ భాషలను నేర్చుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వైద్యం అత్యంత ఖరీదు కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించాలనే లక్ష్యంతోనే సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను కడుతున్నా మని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2700 కోట్లు, సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు, మొత్తంగా ఆ రెండింటికీ రూ.5,226 కోట్లను ఖర్చుచేశామని వివరించారు. రెండేండ్లలో వైద్యారోగ్య శాఖ కోసం రూ.21,800 కోట్లు వెచ్చించామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనాలను కట్టించాలనే సోయి గత ప్రభుత్వానికి ఎందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు.

టిమ్స్ ఆస్పత్రులకు, వరంగల్ దవాఖానాకు కేవలం టెంకాయలుకొట్టి వదిలేశారనీ, పదేండ్లలో వాటిని ఎందుకు కట్టలేదని అడిగారు. ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను 2027 డిసెంబర్ తొమ్మిదో తేదీకల్లా పూర్తిచేసి ఒక్కో ఆస్పత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి స్పెషాల్టీ వైద్యసేవలను అందజేస్తామనీ, వాటిని నిమ్స్ తరహాలో తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. అవన్నీ పూర్తయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరో పదివేల బెడ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆస్పత్రికొచ్చే రోగుల సహాయకులు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. డాక్టర్ ఎమ్‌సీఆర్ టిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ పీజీ విద్య, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అదనంగా సమయం వెచ్చించి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందించే, సర్జరీలు చేసే వైద్యులకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను వేదిక నుంచే ఆదేశించారు. తాము సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తామని ప్రకటించగానే కొందరు పగటివేషగాళ్లలా తిరిగి పోయారనీ, ఇది తామే కట్టామని కేటీఆర్ చెప్పి పోయారని విమర్శించారు. వెనక ఉన్న ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి వెళ్లి మానసిక రోగిని టిమ్స్ కట్టిన తమను గుర్తుపట్టట్లేదా? అని కేటీఆర్ అడిగితే..."ఈడికొచ్చినప్పుడు చార్మినార్ నేనే గట్టిన. హైదరాబాద్‌ను నేనే నిర్మించిన అనుకునేటోన్ని. ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేటోన్ని. ఈడ డాక్టర్లు మంచిగ చూస్తరు. రానురాను పిచ్చి తగ్గిపోతది లే అన్నడంట" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు సమయం ఉందిగానీ ప్రభుత్వ ఆస్పత్రులను కట్టించి ప్రారంభించేందుకు పదేండ్లలో సమయమే దొరలేదా? అని ప్రశ్నించారు. అబద్దాలు మానుకుని ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, నియోజకవర్గానికి పది నుంచి 20 కోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రజలకు సేవచేస్తే చేసిన పాపాలు కొంతైనా తగ్గుతాయని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదనీ, ఇలా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం ప్రజలకు నిజాలు చెబుతూనే ఉంటానన్నారు.

**బీఆర్ఎస్ నేతల ప్రచారం పచ్చి అబద్ధం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ...తాము కట్టిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభిస్తోందని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని విమర్శించారు. సనత్‌నగర్ టిమ్స్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చుచేసింది రూ.70 కోట్లు మాత్రమేననీ, ఆ డబ్బులతో అది ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం కోసం తమ ప్రభుత్వం రెండున్నరేండ్లలో రూ.9 వేల దాకా ఖర్చుపెట్టిందనీ, ఆరు ప్రధాన ఆస్పత్రుల నిర్మాణాలపైనే రూ.3,800 ఖర్చుచేశామని గణాంకాలతో సహా వివరించారు. ఆరోగ్య శ్రీ పథకం కింద పేదలను రూ.10 లక్షల సహాయాన్ని అందిస్తున్నామనీ, ప్రతి నెలా ఆరోగ్య శ్రీ పథకం కిందనే రూ.100 కోట్లు విడుదల చేస్తున్నామని చెప్పారు.

**90 శాతం వైద్యసేవలు జిల్లాల్లోనే అందేలా కృషి : మంత్రి దామోదర్ రాజనర్సింహ**

90 శాతం వైద్యసేవలు జిల్లాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లోనే అందేలా కృషి చేస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్‌లో గుండె సంబంధ, అవయమార్పిడి, కిడ్నీ...ఎల్‌బీనగర్ టిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పీడియాట్రిక్...అల్వాల్ టిమ్స్‌లో న్యూరాలజీ, జెనిటిక్‌కు సంబంధించిన స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తామని మరోమారు చెప్పారు. టిమ్స్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునికమైన రేడియాలజీ విభాగం గురించి వివరించారు. రాబోయే పదేండ్లలో తలసేమియా రహిత తెలంగాణగా మార్చే లక్ష్యంతో ముందుకెళు_న్నామని చెప్పారు. మహిళా సంక్షేమం, వైద్యం, విద్య, సంక్షేమం ప్రభుత్వానికి నాలుగు ఫిల్లర్ల లాంటివనీ, వాటిపైనే దృష్టి పెట్టి తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. ప్రతి టిమ్స్‌లో విదేశీ రోగులకు చికిత్సలు అందించేందుకు వంద పడకల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**దసరాకల్లా అల్వాల్ టిమ్స్...డిసెంబర్ నాటికి ఎల్‌బీనగర్ టిమ్స్ పూర్తిచేస్తాం : మంత్రి కోమటిరెడ్డి**

దసరానాటికల్లా అల్వాల్ టిమ్స్‌ను, డిసెంబర్ నాటికి ఎల్‌బీనగర్ టిమ్స్, వరంగల్ ఆస్పత్రుల నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎల్‌ఓసీలు, సీఎంఆర్ఎఫ్ నిధులను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నామని గణాంకాలతో వివరించారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం 20 శాతం పూర్తయిందని తెలిపారు. ఎల్‌బీఆర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్‌బాపూజీ, అల్వాల్ ఆస్పత్రికి మాజీ సీఎం టి.అంజయ్య, వరంగల్ ఆస్పత్రి ప్రొఫెసర్ జయశంకర్ పేర్లను నామకరణం చేయాలని సీఎంకు సూచించారు.

**రోగుల సేవల్లో 70 శాతం నర్సులదే : మంత్రి పొన్నం**

తెలంగాణ కోసం కొట్లాడిన మర్రి చెన్నారెడ్డి పేరుమీద టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించడం ఆనందంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డాక్టర్లు దేవుళ్లతో సమానమనీ, నర్సులు దైవదూతలని కొనియాడారు. రోగులకు వైద్య సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకమనీ, డాక్టర్లు 30 శాతం సేవ చేస్తే 70 శాతం సేవ నర్సులదేనని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టియానా చోంగ్తూ, కమిషనర్ సంగీతా సత్యనారాయణ, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం హేమంత్ సోరెన్ కు రాహుల్ గాంధీ లేఖ

**హైదరాబాద్ – సూర్య వాస్తవం**

ప్రభుత్వ నియమాక పోటీ పరీక్షల్లో జరిగిన లీక్ లను వ్యతిరేకిస్తూ జార్ఖండ్ విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జీూజ), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జీూజ) నిర్వహించిన పరీక్షలలో అక్రమాలకు వ్యతిరేకంగా రాంచీలోని జైపాల్ సింగ్ స్టేడియంలో విద్యార్థులు చేస్తున్న నిరసన వరుసగా 24వ రోజుకు చేరుకుంది.సీబీఐ ద్వారా సమగ్ర దర్యాప్తు జరగాలని, బాధ్యులకు కఠిన శిక్ష పడాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరెన్ కు లేఖ రాశారు. నిరసన చేస్తున్న విద్యార్థులతో నేరుగా వెళ్లి చర్చలు సాగించాలని ఆయన లేఖలో సూచించారు. గత కొన్ని నెలలుగా విద్యా వ్యవస్థలో పేపర్ లీక్‌లు మరియు అవకతవకలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు పూర్తి మద్దతును అందించామన్నారు. “వారి నిరసన శాంతియుతంగా ఉంది, వారి డిమాండ్లు న్యాయబద్ధమైనవి. మీరు ఏర్పాటు చేసిన ఒక కమిటీ ద్వారా జార్ఖండ్ ప్రభుత్వం వారితో సంప్రదింపులు ప్రారంభించడాన్ని నేను అభినందిస్తున్నాను. విద్యార్థులు లేవనెత్తిన అనేక డిమాండ్లపై ఏకాభిప్రాయం కూడా కుదిరిందని నేను నమ్ముతున్నాను. అయినప్పటికీ, నిరసనలు కొనసాగుతున్నాయి, కొంతమంది విద్యార్థులు నిరవధిక నిరాహార దీక్షలో ఉన్నారు. యువతే భారతదేశ భవిష్యత్తు. దయచేసి వారి మాటలను ఓపికగా విని, ఈ సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోండి” అని రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు.

# బీజేపీకి షెహజాద్ పూనావాలా రాజీనామా...!

**- ఆర్థిక, వ్యక్తిగత పరిస్థితులే కారణమని వెల్లడి...**
**- ప్రైవేట్ రంగంలోకి వెళ్లాలని నిర్ణయం..**




**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :** భారతీయ జనతా పార్టీ మాజీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా పార్టీకి రాజీనామా చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు రాసిన లేఖలో పార్టీతో తనకున్న అన్ని పదవులతో పాటు ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.తన రాజీనామాకు “అత్యవసర ఆర్థిక, వ్యక్తిగత పరిస్థితులు” కారణమని పూనావాలా తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేట్ రంగంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. జూలై 30న కూడా పూనావాలా రాజీనామా లేఖ సమర్పించినప్పటికీ, బీజేపీ నాయకత్వం దానిని అంగీకరించలేదు. తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని నాయకత్వం కోరింది. అయితే, సుదీర్ఘంగా ఆలోచించిన అనంతరం పార్టీ నుంచి వైదొలగాలనే తుది నిర్ణయానికి వచ్చినట్లు తాజా లేఖలో పూనావాలా స్పష్టం చేశారు.

# వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

**- 40 ఏళ్లుగా ప్రజలకు-ప్రభుత్వానికి వారధిగా సేవలందించాం**
**- కలెక్టర్‌కు వెటరన్ జర్నలిస్టుల వినతి**



**కడప– సూర్య వాస్తవం**

నాలుగు దశాబ్దాలకు పైబడి పత్రికా రంగంలో పనిచేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలందించిన వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో కడప జిల్లా వెటరన్ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వెటరన్ జర్నలిస్టులు మాట్లాడుతూ.. తమ జీవితంలోని విలువైన సంవత్సరాలను పత్రికా రంగానికి, ప్రజాసేవకు అంకితం చేశామని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం కృషి చేశామన్నారు. 30 నుంచి 40 సంవత్సరాలకు పైబడి పత్రికా రంగంలో సేవలందించిన అనేక మంది జర్నలిస్టులు ప్రస్తుతం వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. 60 సంవత్సరాలు పైబడిన వెటరన్ జర్నలిస్టులకు వయోభారం, ఆదాయ వనరులు తగ్గిపోవడం, కుటుంబ బాధ్యతలు పెరగడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం అమలులో ఉన్నందున ఆంధ్రప్రదేశ్‌లోనూ అర్హులైన వెటరన్ జర్నలిస్టులకు గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాము ప్రజల కోసం, సమాజం కోసం సుదీర్ఘకాలం సేవలందించిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని వృద్ధాప్యంలో తమకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. పెన్షన్ సౌకర్యం కల్పించడం ద్వారా వెటరన్ జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించినట్లవుతుందని తెలిపారు. కడప జిల్లా వెటరన్ జర్నలిస్టుల సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, ముఖ్యమంత్రి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పెన్షన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వెటరన్ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు ఈశ్వరయ్య, నాణ్యంపల్లి గోపాలకృష్ణ, గుర్రప్ప, బాలకృష్ణారెడ్డి, ఎస్.ఎం. భాష, చీర్ల చెన్నయ్య యాదవ్, శేషారెడ్డి, పి.ఎస్. రాయుడు, వెంకటేష్ యాదవ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# అనంత రైతు కన్నీటి గాథ..!

**- జాడలేని వాన... సాగుపై సందిగ్ధత....!**
**- అనంతలో తగ్గిన ఖరీఫ్ సాగు.. వేరుశనగకు దూరమైన రైతులు...**
**- 1.47 లక్షల హెక్టార్ల లక్ష్యానికి 36 వేల హెక్టార్లలోనే సాగు...**
**- లోటు వర్షపాతంతో ప్రత్యామ్నాయ పంటలపైనా సందిగ్ధత**
**- 1.11 లక్షల హెక్టార్లలో సాగు ప్రశ్నార్థకం**

**అనంతపురం వ్యవసాయం – సూర్య వాస్తవం :**

వర్షాభావ పరిస్థితులు ఖరీఫ్ రైతుల ఆశలను నీరు గారుస్తున్నాయి. జిల్లాకు ప్రధాన పంట అయిన వేరుశనగ సాగు ఈ ఏడాది గణనీయంగా తగ్గిపోయింది. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం జిల్లాలో 1.47 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగు కావాల్సి ఉండగా.. ఆగస్టు 5 నాటికి కేవలం 36 వేల హెక్టార్లలోనే సాగు జరిగింది. దీంతో లక్ష్య విస్తీర్ణంలో సుమారు 25 శాతం మాత్రమే సాగులోకి వచ్చింది.

**1.11 లక్షల హెక్టార్లలో సాగు ప్రశ్నార్థకం**

వేరుశనగ సాగు లక్ష్యంతో పోలిస్తే సుమారు 1.11 లక్షల హెక్టార్లలో ఈ పంట సాగు జరగలేదు. జిల్లాలో మొత్తం ఖరీఫ్ పంటల అంచనా విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లు కాగా.. ఇప్పటివరకు సుమారు 1.40 లక్షల హెక్టార్లు మాత్రమే సాగులోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. మండలాల్లోనూ అదే పరిస్థితి వర్షాభావ ప్రభావం మండలాల వారీగా స్పష్టంగా కనిపిస్తోంది. నల్లమాడ మండలంలో సాధార ణంగా 4 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేయాల్సి ఉండగా.. ఈసారి బోరుబావుల ఆధారంగా కేవలం 800 హెక్టార్లలోనే సాగు చేశారు. మరో 3,200 హెక్టార్లలో సాగు జరగలేదు. దీంతో వ్యవసాయ కూలీలకు కూడా పనులు తగ్గి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ప్రత్యామ్నాయ పంటలపై అధికారుల అవగాహన వర్షాలు ఆలస్యం కావడంతో తక్కువ కాలంలో చేతికొచ్చే ఉలవలు, అలసందలు, మినుములు, పెసర, జొన్న తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. మండలానికి అవసరమైన ప్రత్యామ్నాయ విత్తనాలపై ఉన్నతా ధికారులకు నివేదికలు పంపారు. గ్రామాల వారీగా రైతు సమావేశాలు నిర్వహిస్తూ వర్షాభావ పరిస్థితుల్లో చేపట్టాల్సిన సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు.

**జాడలేని వాన... సాగుపై సందిగ్ధత....!**

వర్షాలు ముఖం చాటేయడంతో జిల్లాలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడింది. సకాలంలో వానలు కురవకపోవడంతో ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండిపోతున్న పంటలు... పెరుగుతున్న ఇబ్బందులు**

వర్షాలు లేక పొలాల్లో పైర్లు ఎండిపోతున్నాయి. ఉన్న కొద్దిపాటి పంటలను కాపాడుకునేందుకు రైతులు నీళ్ల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకవైపు సాగునీరు అందక, మరోవైపు తీవ్ర భానుడి తాపానికి పంటలు దెబ్బతింటుండటంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో రైతన్నలు ఉన్నారు.

**ప్రత్యామ్నాయ సాగుపైనా అనిశ్చితి**

ఇప్పటికైనా వర్షాలు కురిస్తే ప్రత్యామ్నాయ పంటలు వేద్దామని కొందరు రైతులు పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసుకున్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. అయితే, వాన జాడే లేకపోవడంతో ప్రత్యామ్నాయ సాగు చేపట్టాలా వద్దా అనే అనిశ్చితి నెలకొంది.

**పెరిగిన పెట్టుబడి భారం**

మరోవైపు విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటడం, కూలీల ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో పెట్టుబడులు పెట్టేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందో లేదో తెలియని పరిస్థితిలో మళ్లీ అప్పులు చేయడంపై భయపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సబ్సిడీ విత్తనాలను అందించడంతో పాటు, రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

**31 శాతం వర్షపాతం లోటు**

జూన్, జూలై రెండు నెలల్లో సాధారణంగా 125.5 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా.. కేవలం 87.2 మి.మీ. మాత్రమే నమోదైంది. దీంతో 31 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.

# ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్....!

**- చెత్తతో నిండిన వీధి...**
**- చిన్నారులకు అందేంత తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్**
**- ప్రమాదం జరగకముందే రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి**
**- తీవ్ర దుర్వాసనతో స్థానికుల అవస్థలు**
**- మున్సిపల్ అధికారులు వెంటనే చెత్త తొలగించాలని డిమాండ్**




**కదిరి టౌన్ – సూర్య వాస్తవం :** కదిరి పట్టణంలోని మెయిన్ పోస్టాఫీస్ వెనుక ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. నేలమట్టానికి అత్యంత తక్కువ ఎత్తులో ఉండటంతో వీధిలో ఆడుకునే చిన్నారులకు సులభంగా అందే పరిస్థితి నెలకొంది. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం చోటుచేసుకోకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైతే దాని ఎత్తును పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



**చెత్తతో దుర్వాసన...**

అదే ప్రాంతంలో పెద్దఎత్తున చెత్తాచెదారం పేరుకుపోవడంతో పరిసరాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. అపరిశుభ్రత కారణంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్...!

- ఈ నెల 22న శింగనమల నియోజకవర్గానికి సీఎం చంద్రబాబు పర్యటన
- కొర్రపాడు గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీశ్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** ఈ నెల 22న అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీశ్ సోమవారం బుక్కరాయ సముద్రం మండలం కొర్రపాడు గురుకుల పాఠశాలను పరిశీలించారు. సీఎం పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు.. పాఠశాల పరిసరాలు, భద్రతా చర్యలు, అవసరమైన మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో చర్చించారు. పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# దారి దోపిడీలకు పాల్పడుతున్న కేటుగాళ్ళు అరెస్ట్...!

- పోలీసుల అదుపులోకి ముగ్గురు...
- రెండు వాహనాలు స్వాధీనం..
- వరుసగా మూడు నేరాలకు పాల్పడిన ముఠా...!
- ఆత్మకూరు వద్ద గొర్రెల దొంగతనానికి యత్నం...



**అనంతపురం క్రైమ్- సూర్య వాస్తవం :** చెడు అలవాట్లకు బానిసై వరుస నేరాలకు పాల్పడుతున్న యువకుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు ముగ్గురు నిందితులను పోలీసులు అదుపు లోకి తీసుకుని, వారి నుంచి టాటా ఇండికా, బొలెరో పికప్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున సంపనూరు పరిధిలో వాహనదారులపై దాడి చేసి బొలెరో వాహనాన్ని అపహ రించడంతో పాటు నగదు దోపిడీకి పాల్పడ్డారు. అనంతరం ఆత్మకూరు మండల పరిధిలో గొర్రెలను దొంగిలించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.కేసు దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, మరో నిందితుడు రంజీత్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నేరాలకు పాల్పడే యువత చట్టపరంగా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పోలీసులు హెచ్చరించారు .

# రోడ్డు ప్రమాదంలో మరణించిన శ్రీనివాసులు

- మృతుడు భార్యకి లక్ష వితరణ చేసిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కత్రిమల ప్రభాకర్ చౌదరి



**పామిడి - సూర్య వాస్తవం :** గుంతకల్ నియోజకవర్గం పరిధిలోని గుత్తి మండలంలో గల మామడూరు గ్రామస్తుడు డి.శ్రీనివాసులు అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్త రోడ్డు ప్రమాదంలో మరణించడంతో పామిడి,గుత్తి టిడిపి ఇన్చార్జ్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమారుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు సోమవారం టిడిపి సీనియర్ నాయ కులు, గుత్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ కత్రిమల ప్రభాకరచౌదరి చేతుల మీదుగా లక్ష రూపాయలు విచారణగా ఆ కుటుంబానికి అందజేసి ప్రగాఢ సానుభూతి తెలియ జేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి.శ్రీనివాసులు టిడిపి పార్టీ కోసం సుదీర్ఘంగా సేవలందించాడని ఆయన చురుకైన మంచి కార్యకర్తలు ఈ గ్రామం లో ఆయన అకాల మరణం చెందడం టిడిపికి తీరనిలోటన్నారు. ఆయన కుటుంబానికి ఏసమస్యలు వచ్చిన తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా తెలిపారు. ఈకార్యక్రమంలో,కత్రిమల ప్రభాకరచౌదరి, నారాయణస్వామి కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రి భూ వ్యవహారంలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసిన కలెక్టర్...!

- ల్యాండ్ సీలింగ్ రికార్డుల్లో పలు వ్యత్యాసాల గుర్తింపు..
- సర్వే నం.770-జు2లో 2.40 ఎకరాల భూమిపై వివాదం...
- రికార్డుల పరిశీలనలో నిర్లక్ష్యంపై ఉద్యోగులపై చర్యలు...



**అనంతపురం కలెక్టర్ రేట్ - సూర్య వాస్తవం :** తాడిపత్రి మండల పరిధిలోని సర్వే నం.770-జు2లో ఉన్న 2.40 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-A ( 1 ( d కింద నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించే ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమగ్రంగా రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలన లో భూ రికార్డుల్లో పలు వ్యత్యాసాలు గుర్తించ దంతో బాధ్యులైన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్‌లో నమోదులో మార్పులు జరిగినట్లు కనిపించడం, తహసీల్దార్ కార్యాలయంలోని ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్‌లో 17, 18 పేజీలు కనిపించకపోవడం, 1-దీ రిజిస్టర్, అడంగల్‌లో భూమి డి.పట్టా (ఎల్.సీ.)గా నమోదై ఉండటం వంటి అంశాలు అధికారుల దృష్టికి వచ్చాయి. అదేవిధంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో 'సీలింగ్ ల్యాండ్'గా పేర్కొనడం, ఆర్డీఓ కార్యాలయంలోని ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్‌లో C.C.No. 2963/75 కింద సర్వే నం.770-జు2లో 2.40 ఎకరాల భూమికి సంబం ధించిన నమోదు ఉండటాన్ని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించకపోవడం, అవసరమైన విచారణ, ధృవీకరణ చేయకపోవడం, రికార్డుల్లోని వ్యత్యాసాలను ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకురాకపోవడం వంటి ఆరోపణలపై చర్యలు చేపట్టారు.నలుగురు సస్పెన్షన్: తాడిపత్రి అప్పటి తహసీల్దార్ (ఎఫ్ఏసీ), ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ జి.సోమశేఖర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వర్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి కె.వెంకటస్వామి, జూనియర్ అసిస్టెంట్ ఎస్.మహమ్మద్ షఫీలను సస్పెండ్ చేస్తూ ఛార్జ్ మెమోలు జారీ చేశారు. ముగ్గురికి ఛార్జ్ మెమోలు: అనంతపురం ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ యు.రాజేంద్రప్రసాద్, కలెక్టరేట్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ (ల్యాండ్ రిఫార్మ్స్‌లో డిప్యుటేషన్) కె.పవన్ కుమార్, అనంతపురం ఆర్డీఓ కార్యాలయం అప్పటి డీఏఓ (ఇంచార్జి) ఎస్.బి. కుల్లాయప్పలకు ఛార్జ్ మెమోలు జారీ చేసి శాఖాపరమైన విచారణకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూములు, ల్యాండ్ సీలింగ్ భూములు, నిషేధిత ఆస్తులకు సంబంధించిన రికార్డుల పరిశీలనలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల ధృవీకరణలో లోపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కలెక్టర్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. బాధ్యతల్లో లోపాలు గుర్తించిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఉద్యోగులపై కూటమి ప్రభుత్వానికి కక్ష సాధింపు ధోరణి

- టీచర్ల సస్పెన్షన్లు వెంటనే ఎత్తివేయాలి
- లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరిక..



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి.రమణ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు బదులుగా ఔట్‌సోర్సింగ్ నియామకాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయాన్ని చంద్రబాబు గతంలో తన 'మనసులో మాట' పుస్తకంలో పేర్కొన్నారని విమ ర్శించారు. ఉద్యోగంలో చేరే సమయంలో లేని టెట్‌ను ప్రస్తుతం నిర్వహించడం సమంజసం కాదని ప్రశ్నిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఉపాధ్యాయులపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం అన్యాయ మన్నారు. వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులపై చర్యలు తీసుకోవడాన్ని ఆయన తప్పు బట్టారు.మెగా డీఎస్సీలో అవకతవకలపై విచారణ జరపాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, నియామకాల్లో అన్యాయం జరిగిన అభ్యరు లకు న్యాయం చేయాలని ఉపాధ్యాయులు పోరాటం చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం కక్ష సాధింపు చర్యలేనని రమణ ఆరోపించారు. అదే సమయంలో డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారితో నిరసనలు నిర్వహించేందుకు ప్రోత్సహించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ విధానాలను బహిరంగంగా విమర్శించిన సందర్భాల్లో చర్యలు తీసుకోలేదని రమణ పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తమ సమస్యలను చెప్పుకు నేందుకు వెళ్లిన ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతోందన్నారు.

మరోవైపు వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో సుమారు రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులపై చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని కె.వి.రమణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# నిత్య కృషివలుడు.. మానవతామూర్తి దాసరి మోహన్ బాబు...!

- మార్గన్ సేవా ట్రస్ట్ ద్వారా నిరంతర సేవా కార్యక్రమాలు...
- ట్రస్ట్ సభ్యులు, నాయకులు, శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా జన్మదిన వేడుకలు..
- సమాజ సేవలో దాసరి మోహన్ బాబు కృషి అభినందనీయమన్న శ్రేయోభిలాషులు...!
- జన్మదిన వేడుకల్లో ఘనంగా సత్కరించిన శ్రేయోభిలాషులు, నాయకులు...!





**అనంతపురం టౌన్- సూర్య వాస్తవం :** పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో మార్గన్ సేవా ట్రస్ట్‌ను స్థాపించి, నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్న దాసరి మోహన్ బాబు నిత్య కృషివరుడిగా, మానవతామూర్తిగా గుర్తింపు పొందుతు న్నారని పలువురు కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని హైదరాబాద్ చెఫ్ హోటల్‌లో మార్గన్ సేవా ట్రస్ట్ సభ్యులు, సీనియర్ నాయకులు, శ్రేయోభిలాషులు, మిత్రుల ఆధ్వ ర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి మోహన్ బాబుకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మార్గన్ సేవా ట్రస్ట్ ద్వారా ఆయన చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను నాయకులు, శ్రేయోభిలాషులు అభినందించారు. సమాజ సేవ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం ఎంతోమందికి స్ఫూర్తిదా యకమని కొనియాడారు. పేదలు, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న దాసరి మోహన్ బాబు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. ఆయన సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మరింత మంది సమాజ సేవలో భాగస్వాములు కావాలని శ్రేయోభిలాషులు పిలుపునిచ్చారు.

## రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య పరేడ్‌లో ప్రతిభ చాటిన ఉరవకొండ విద్యార్థులు...!

- యూత్ రెడ్ క్రాస్ కంటింజెంట్ తరఫున పాల్గొన్న ఇద్దరు క్యాడెట్లు...
- పరశురాముడు, రాజ్‌కుమార్‌కు కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకుల అభినందనలు...!



**ఉరవకొండ టౌన్ - సూర్య వాస్తవం :** విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య వేడుకల పరేడ్‌లో ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ క్యాడెట్లు పాల్గొని కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. యూత్ రెడ్ క్రాస్ కంటింజెంట్ తరఫున బి.కామ్ మూడో సంవత్సరం విద్యార్థి బి. పరశురాముడు, బి.ఏ రెండో సంవత్సరం విద్యార్థి టి. రాజ్‌కుమార్ ప్రతిష్టాత్మక పరేడ్‌లో పాల్గొన్నారు. అమరావతి లోని వీఐటీ యూనివర్సిటీలో ఆగస్టు 6 నుంచి 8 వరకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణను ఇద్దరు విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం ఆగస్టు 15న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరేడ్‌లో పాల్గొని సోమవారం కళాశాలకు తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. శైలజారాణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్. మస్తానప్ప, ఎన్ఎస్ఎస్ పీఓ, బోటనీ లెక్చరర్ విష్ణుప్రియ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్‌టేకింగ్ ఆఫీసర్, ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుకను అణచొద్దు....

- జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి




**గుంతకల్లు -సూర్య వాస్తవం :** రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీయూ డబ్ల్యూజే గుంతకల్లు నియోజకవర్గ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ రమాదేవికి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకంలోని సమస్యలను పరిష్కరించాలని, ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కోసం జర్నలిస్టులకు పింఛన్ పథకం వర్తింపజేయాలని, విధి నిర్వహణలో దాడులు, బెదిరింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో జి.ఎం. మొహమ్మద్ రఫీ, రఫిక్,వెంకట రాముడు, బోనాల ప్రకాష్,కురుబ హరి,గోపాలరావు, రాజేష్,శేషగిరి, చంద్రశేఖర్, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో వీరభద్ర స్వామి



**పామిడి - సూర్య వాస్తవం :** మండలంలోని తంబళ్లపల్లి గ్రామం పొలిమేరల్లో వెలసిన వీరభద్ర స్వామి భద్రకాళి అమ్మవారు శ్రావణ మాస మొదటి సోమవారం ప్రత్యేక అలంకరణలో విరజిల్లుతున్న (గుడ్ల వీరన్న స్వామి) వారికి మొదటి శ్రావణమాసం సోమవారం సందర్భంగా వేకు జామున అర్చకులు రవీంద్రయ్య ఉదయాన్నే అభిషేకాలు అర్చనలు ఆకు పూజలతో ఆలయ కమిటీ వారు గుడ్ల వీరన్న భక్తాదులందరూ కలిసి పూజలు చేశారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదాన సేవ, ఆధ్యాత్మిక గురువు సురేంద్ర మహారాజు వారిచే ఉపన్యాసాలు, భజనలు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఆధ్యాత్మిక శోభచేకూరింది. భక్తాదులు స్వామిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సురేంద్ర మహారాజ్, రాజంపేట ఫారెస్ట్ ఆఫీసర్ నాయుడు పాల్గొన్నారు వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల రామచంద్రారెడ్డి వైస్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి కమిటీ సభ్యులు వీరారెడ్డి ఈశ్వర్ రెడ్డి సోమశేఖర్ రెడ్డి రాంగోపాల్ రెడ్డి కమిటీ మెంబర్లు భక్తాదులో పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుకొని మొక్కులు తీర్చుకున్నారు

## అమరులైన పోలీసు కుటుంబాలకు అండగా...

# 14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభు కుమార్...!

- అమరులైన పోలీసు కుటుంబాల సమస్యలపై సమీక్ష సమావేశం...!
- సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు....
- పెండింగ్ సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** బుక్కరాయ సముద్రం మండలం జంతలూరులోని 14వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదాలు, అనారోగ్యం తదితర కారణాలతో మృతి చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన ఫ్యామిలీ బెనిఫిట్స్, సంక్షేమ ప్రయోజనాలపై యూనిట్ కమాండెంట్ ప్రభు కుమార్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా జారీ చేసిన మెమో ఆధారంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మృతి చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో కమాండెంట్ నేరుగా మాట్లాడి, వారికి అందాల్సిన ఫ్యామిలీ పెన్షన్, ఇతర ఆర్థిక ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై వివరాలను తెలుసుకున్నారు. కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాల్లో ఏవైనా పెండింగ్‌లో ఉన్నా, సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురవుతున్నా వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని నిర్ణయించారు. కుటుంబ సభ్యుల అభ్యర్థనలు, పెండింగ్ సమస్యలను సమగ్రంగా నమోదు చేసి డీజీపీ కార్యాలయానికి నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ ద్వారా రావాల్సిన ప్రతి ప్రయోజనం సకాలంలో అందేలా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సహకారంతో నిరంతరం సమీక్షిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, ఏవో విజయలక్ష్మి, లైజనింగ్ ఆఫీసర్ ఆర్ఎస్ఐ నవీన్‌కుమార్, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, ఏ సెక్షన్, బి సెక్షన్ సూపరింటెండెంట్లు, కార్యాలయ సిబ్బంది, మృతి చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉమానగర్ బాధితుల స్థలాలను

# ఆక్రమించారంటూ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు...!

- 20 రోజులుగా అధికారుల చుట్టూ తిరిగినా స్పందన లేదని వెంకటప్రసాద్ ఆవేదన...
- స్థలాన్ని పరిశీలించిన ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్...
- ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలంలో గుడి ఎలా నిర్మిస్తారని ప్రశ్న...?
- ఆక్రమణలు వెంటనే తొలగించాలని వీఆర్వో హెచ్చరిక
- తొలగించకపోతే కేసు నమోదు చేస్తామని స్పష్టం
- కలెక్టర్ ఆదేశాల మేరకే చర్యలు చేపట్టామని వీఆర్వో వెల్లడి



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఉమానగర్ బాధితుల కేటాయించిన స్థలాలను కొందరు ఆక్రమించారని మాజీ కౌన్సిలర్ వెంకటప్రసాద్ ఆర్ఐ సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులకు జరిగిన అన్యాయాన్ని వివరించి, వారికి న్యాయం చేయాలని కోరారు. ఇంతకుముందు కూడా పలు అధికారులకు వినతిపత్రం సమర్పించిన ప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వెంకటప్రసాద్ తెలిపారు. గత 20 రోజులుగా మున్సిపల్ కార్యాలయం, టౌన్ ప్లానింగ్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా సరైన స్పందన రాలేదని పేర్కొన్నారు. వినతిపత్రాన్ని పరిశీలించిన ఆర్ఐ సందీప్ వెంటనే వీఆర్వో గోవింద నాయక్‌కు ఫోన్ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. దీంతో వీఆర్వో గోవింద నాయక్, సర్వేయర్ శ్వేతతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని ప్రభుత్వం పట్టాల ద్వారా ఇళ్లు లేని పేదలకు కేటాయించిందని, అక్కడ గుడి నిర్మాణానికి ఎలా అనుమతిస్తారని వీఆర్వో ప్రశ్నించారు. స్థలంలో గుడి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన బండలను వెంటనే తొలగించాలని ఆక్రమణదారులను హెచ్చరించారు. లేకపోతే కేసు నమోదు చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఇది కలెక్టర్ ఆదేశాల మేరకు జరుగుతున్న చర్యలని, ఆక్రమణలు తొలగించే వరకు తాము అక్కడే ఉంటామని వీఆర్వో గోవింద నాయక్ తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ వెంకటప్రసాద్ కోరారు.

# ద్విచక్ర వాహన దొంగల ముఠా అరెస్ట్...!

- రూ 20 లక్షల విలువైన 20 బైకుల చోరీ కేసులు ఛేదింపు
- ఆఫీసులు, రెస్టారెంట్ల వద్ద పార్క్ చేసిన బైకులే టార్గెట్...
- పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో గత రెండు నెలలుగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న వరుస బైక్ దొంగతనాలపై అనంతపురం వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నాడు ఉదయం 8 గంటల సమయంలో ఎన్టీఆర్ మార్గ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన మోటార్‌సైకిల్‌ను గుర్తించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు (నార్పల)తో పాటు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 13 బైకులు, ఫోర్త్‌టౌన్ పరిధిలో 4 బైకులు, కదిరిలో 1, దొడ్డబళ్లాపూర్‌లో 1, తిరుపతిలో 1 బైక్ చోరీ చేసినట్లు వెల్లడైంది. మొత్తం 20 బైకులను రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. చోరీ చేసిన బైకులను ఒకచోట డంప్ చేసి అనంతరం బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు తరలించి విక్రయించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు తెలిపారు. పరిచయస్తులకు తక్కువ ధరకు విక్రయించడం, ఇతర ప్రాంతాల్లో తాకట్టు పెట్టడం వంటి విధానాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ఆఫీసులు, రెస్టారెంట్లు తదితర ప్రాంతాల వద్ద పార్క్ చేసిన బైకులను నిందితులు ప్రధానంగా టార్గెట్ చేసేవారని డీఎస్పీ తెలిపారు. నిందితులంతా స్నేహితులేనని, ఒకే కమ్యూనిటీకి చెందినవారని వివరించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారని, సిబ్బందికి రివార్డులు అందజేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



## శ్రీ ఈశ్వరీ దేవి భక్తులకు అన్నదానం

**- బలిజ అన్నదాన సత్రం అధ్యక్షులు శ్రీనివాసులు రాయల్**





**బ్రహ్మంగారి మఠం - సూర్య వాస్తవం :** జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి అమ్మవారి 323 జయంతి సందర్భంగా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర శివకుమార్ స్వాముల వారి ఆధ్వర్యంలో జరిగిన మహోత్సవలకు వచ్చిన భక్తులకు బలిజ అన్నదాన సత్రం అధ్యక్షులు దరిమిశెట్టి శ్రీనివాసులు రాయల్ అన్నదానం చేశారు. బద్వేల్ వాస్తవ్యులు కీ.శే. ధరిమిశెట్టి కూరగాయల వెంకటయ్య--ఆదిలక్ష్మమ్మ దంపతుల కుమారులు ధరిమిశెట్టి వెంకటసుబ్బయ్య--లక్ష్మి దంపతులు, వారి కుమారుడు స్థానిక బలిజ అన్నదాన సత్రం అధ్యక్షులు ధరిమిశెట్టి శ్రీనివాసులు రాయల్ --శ్రీదేవి దంపతులు, వారి కుమారులు వరుణ్‌కుమార్, వీరేన్‌కుమార్, రిత్విక్ రాయల్, కుమార్తె తేజస్విని ఆధ్వర్యంలో ఈ అన్నప్రసాద వితరణ చేపట్టారు. జయంతి మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు మధ్యాహ్న భోజనాన్ని 500 మంది కీ పైగా ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఉత్సవాలకు హాజరైన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి దాతల సేవాభావాన్ని అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ తెలగ కాపు నిత్య అన్నదాన సంఘం కమిటీ సభ్యులు మరియు మేనేజర్ కొక్కు రవి రాయల్ అంబిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్ అలాగే కోనేటి వెంకటసుబ్బయ్య, ఆకుల వీరయ్య, ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, ఆకుల శివ, ఆకుల కొండయ్య శాసనాలు శివ రామకృష్ణ వినుకొండ వెంకటనారాయణ ,దస్తగిరి మరియు బంధుమిత్రుమిత్రాలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా జగన్మాత 323వ జయంతి మహోత్సవాలు

**- పూజలు నిర్వహించిన మఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వామి దంపతులు**





**బ్రహ్మంగారి మఠం - సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠంలో వెలసిన జగన్మాత శ్రీ ఈశ్వరి దేవి అమ్మవారి 323వ జయంతి మహోత్సవములు మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర కుమార స్వాముల వారి దంపతుల చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పూజా కార్యక్రమాల్లో స్థానిక భక్తులు, అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవాలలో భాగంగా ఉదయం నుండి పూజా కార్యక్రమాలు మొదలుపెట్టి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు మఠాధిపతులు దంపతుల చేతుల మీదగా జరిగాయి. అనంతరం మహోత్సవాలకు వచ్చిన భక్తులు అమ్మవారి కలిశాలు శిరసు ధరించి గుడి ఉత్సవం చేశారు. అలాగే ఈ మహోత్సవాలకు వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం రాత్రి స్వర్ణ పుష్పార్చన, ఉయల సేవ, మంగళహారతి మొదలగు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

## ఘనంగా ప్రజానేత పంతంగాని జన్మదిన వేడుకలు

**చిట్వేలి- సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా చిట్వేలి మండలం నాగవరం గ్రామంలో, గ్రామ యువత ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతంగాని నరసింహ ప్రసాద్ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పంతంగాని నరసింహ ప్రసాద్ గారు గ్రామంలోనీ పలువురు యువత పెద్దలను ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి యువత తెచ్చిన కేక్ ను కట్ చేసి యువతకు, పెద్దలకు తినిపించారు. ఈ సందర్భంగా పంతంగాని మాట్లాడుతూ నా జన్మదినం సందర్భంగా యువత, గ్రామ ప్రజలు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామ యువతతో మాట మంత్రి నిర్వహించి ఆనందంగా గడిపారు. అనంతరం వారి తండ్రి డాక్టర్ పంతంగానీ పుల్లయ్య గారికి ఘనంగా నివాళులర్పించారు.



### శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# ఘనంగా ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహణ

**- రాయలసీమలో తొలిసారిగా 200 మంది విద్యార్థులకు ఐబీఎం ఇంటర్న్‌షిప్ అవకాశం**







**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** విద్యార్థుల్లో ఇంజనీరింగ్ విద్యపై స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు, ఉన్నతమైన కెరీర్‌ను నిర్మించుకు నేందుకు అవసరమైన నైపుణ్యాలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్ తదితర అంశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో నూతన విద్యార్థుల కోసం సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం ఘనంగా నిర్వ హించారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ దినకర్ రెడ్డి, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్, ఆంధ్రప్రదేశ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు కేవలం తరగతి గదిలో పొందే విద్య మాత్రమే సరిపోదని, పరిశ్రమలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు లభించిన అరుదైన అవకాశాన్ని డాక్టర్ దినకర్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాయలసీమ ప్రాంతంలోనే మొట్టమొదటిసారిగా 200 మంది విద్యార్థులకు ఐబీఎం ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థతో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, వృత్తిపరమైన నైపుణ్యాలపై విలువైన అనుభవం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా తమ కెరీర్‌కు పునాది వేసుకునే అవకాశాలుగా భావించాలని ఆయన సూచించారు. ఇంటర్న్‌షిప్ సమయంలో నేర్చుకునే ప్రతి అంశాన్ని భవిష్యత్ ఉద్యోగ అవ



కాశాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా, ఇన్స్పిరేషనల్ స్పీకర్ మిస్టర్ నాగ ప్రసాద్ హాజరై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. విద్యార్థి జీవితంలో లక్ష్య నిర్దేశం ఎంతో ముఖ్యమని, స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమపై తమకు నమ్మకం పెంచుకోవాలని, వైఫల్యాలను చూసి వెనుకడుగు వేయకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, కళాశాలలో లభిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ శ్రీనివాసమూర్తి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "వాట్ ఈజ్ ఇంజనీరింగ్" అనే అంశాన్ని వివరించారు. ఇంజనీరింగ్ అనేది కేవలం నాలుగు సంవత్సరాల విద్యను పూర్తి చేసి డిగ్రీ పొందడం మాత్రమే కాదని, సమాజంలో ఉన్న సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను చూపించే సామర్థ్యాన్ని పెంపొంది ంచుకోవడమే నిజమైన ఇంజనీరింగ్ అని తెలిపారు. విద్యార్థులు తమ ఇంజనీరింగ్ విద్యా ప్రయాణంలో డ్రీమ్, డిసిప్లిన్, స్కిల్స్, క్యారెక్టర్, ఎంప్లాయ్‌మెంట్, టీమ్ వర్క్, లీడర్‌షిప్ క్వాలిటీస్ వంటి అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన డ్రీమ్ ఉండాలని, ఆ కలను సాకారం చేసుకునేందుకు డిసిప్లిన్ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. డిగ్రీతో పాటు పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్ నేర్చుకోవాలని, మంచి క్యారెక్టర్ను నిర్మించుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగం పొందడం మాత్రమే కాకుండా, ఉద్యోగంలో నిరంతరం ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను కూడా విద్యార్థులు పెంపొందించుకోవాలని తెలిపారు. అలాగే టీమ్‌లో కలిసి పనిచేయడం, ఇతరుల అభిప్రా యాలను గౌరవించడం, బాధ్యతలు స్వీకరించడం, అవసరమైన సందర్భాల్లో నాయకత్వం వహించడం వంటి టీమ్ వర్క్, లీడర్‌షిప్ క్వాలిటీస్ ప్రతి విద్యార్థికి అవసరమని ప్రిన్సిపాల్ వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ విద్యార్థుల నడవడిక, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తనపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళా విద్యార్థులు కళాశాలలో విద్యను అభ్యసించే సమయంలో తమ భద్రత, క్రమశిక్షణ, వ్యక్తిగత బాధ్యత, పరస్పర గౌరవం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచిం ఈ సందర్భంగా రాయలసీమలోనే తొలిసారిగా 200 మంది విద్యార్థులకు ఐబీఎం ఇంటర్న్‌షిప్ అవకాశం లభించడం కళాశాల విద్యా ప్రమాణాలు, పరిశ్రమ అనుసంధానానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

ఈ అవకాశాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏ నరేష్ కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ ఽ ప్లేస్‌మెంట్స్ విభాగాధిపతి డాక్టర్ కె. ఇంతియాజ్, ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి పి. సుబహాన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి. ప్రతాప్ రావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి. శ్రావణ్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి. సౌజన్య, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ. కరుణాకర్, బేసిక్ సైన్సెస్ ఽ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. నాగేంద్ర, అధ్యాపకులు, సిబ్బంది, నూతన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఉత్సాహాన్ని, స్ఫూర్తిని అందించిన ఈ ఓరియంటేషన్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది.

## పగడాల వారింట ఆకాశాన్నంటిన జన్మదిన వేడుకలు

**- పవన్ మీద అభిమానంతో తన కుమారునికి అకీరానందన్ పేరు**






**చిట్వేలి- సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా చిట్వేలు మండలం పగడాల శివకుమార్ కుమారుడు అకిరా నందన్ పుట్టినరోజు వేడుకలు జనసేన పార్టీ అతిరధుల మహారాజుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది పగడాల శివకుమార్ చిరంజీవి యువత చిట్వేల్ టౌన్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే మెగా కుటుంబం అన్న అతనికి ఉన్న అభిమానం వెలకట్టలేనిది జనసేన పార్టీ నిజమైన డైహార్ట్ ఫ్యాన్ గా పగడాల శివకుమార్ గురించి చిట్వేలి మండలంలో చర్చించుకుంటారు చిట్వేలి మండలంలో రాష్ట్రంలో ఎవరైనా పవనన్నను ఒక్క మాట అన్నా కూడా వెంటనే వారి పైన విరుచుకు పడడం పవన్ అన్న మీద ఈగ వాలిన తట్టుకోలే డు ప్రస్తుత రాజకీయాలలో పవనన్న ఉండాలి సమాజానికి ఎంతో మంచి జరుగుతుందని ఆయన తెలియజేస్తుంటాడు. జనసేన పార్టీ జిల్లా సీనియర్ నాయకులు అతికారి కృష్ణ రాయలసీమ జనసేన పార్టీ సమన్వయకర్త జోగినేని మనీ జనసేన పార్టీ సీనియర్ నాయకులు యనమాల భాస్కర్ జనసేన పార్టీ మండల యువ నాయకులు ఆనాల సునీల్ బిజెపి రాష్ట్ర నాయకులు లోకేష్ చిట్వేలి మండలంలోని బంధువులు అతిథులు శ్రేయోభిలాషులు సమక్షంలో వైభవంగా జరిగాయి జనసేన పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ పగడాల శివకుమార్ లాంటి కార్యకర్తలు జనసేన పార్టీకి ఉండడం నిజంగా ఇలాంటి వారి వల్లే రాష్ట్రంలో జనసేన పార్టీ ఈ స్థాయిలో ఉందని వారు తెలియజేశారు పవన్ కళ్యాణ్ మీద అతనికి ఎంత అభిమానం ఉంది అంటే తన కుమారుడికి పవన్ కళ్యాణ్ కుమారుడు అకిరా నందన్ పేరు పెట్టుకున్నాడు అంటే ఆ కుటుంబాన్ని అతను ఏ స్థాయిలో అభిమానిస్తున్నాడో అర్థమవుతుందని వారు అన్నారు నిజంగా పుట్టినరోజు వేడుకలు చిట్వేలి మండలంలో అంబరాన్నంటాయి వచ్చిన అతిథులందరికీ అద్భుతమైన ఆతిథ్యం ఇవ్వడం జరిగింది. పగడాల శివకుమార్ మాట్లాడుతూ తన తండ్రి రామసుబ్బయ్య చిరంజీవి అభిమాని అని తను పవన్ కళ్యాణ్ కు మేఘా కుటుంబానికి వీర అభిమానిని తన కుమారుడు కూడా అకిరా నందన్ అభిమానిగా ఉండాలన్నది ఉంటాడన్నది తన కోరిక అని మెగా కుటుంబం అంటే తనకు మాకు అంత అభిమానం అని ఆయన అన్నారు.

## జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి

**- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య**
**- ఇళ్ల స్థలాలు, ఆరోగ్య బీమా కల్పించాలి....**
**- పత్తికొండలో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**





**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే పతాకాన్ని పి. రామచంద్రయ్య ఆవిష్కరించారు. అనంతరం నాలుగు స్తంభాల మండపం వద్ద ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు ఎం. సాల్రంగడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు డి.రాజాసాహెబ్, యు. కారుమంచి, వెంకటేశ్వరరెడ్డి, కడవల సుధాకర్, కారం నాగరాజు, జయ రాముడు, రామాంజనేయులు, కృష్ణయ్య, రవిచంద్ర తదితరులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ సమాజంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అందించాలని ఆయన కోరారు. పత్తికొండలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో చిన్న ఓబులేష్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్ గౌడ్, నియోజకవర్గ కార్యదర్శి ఓబులేసు, గౌరవ అధ్యక్షులు రంగన్న, గౌరవ సలహాదారు నాగరాజు, సహాయ కార్యదర్శి హనుమంతు, రాజు, నారాయణగుప్తా, షఫీ, సుధాకర్, శేక్షావలి, మనోహర్, కాశి, జాఫర్, విశ్వనాథ్, రమేష్, బద్రీనాథ్, అన్సార్ బాషా, ప్రకాష్, న్యాయవాది హరికృష్ణ, జనార్దన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీదేవి జీవిత చరిత్ర ఆధారంగా 'ది ఎంప్రెస్'..
# రామ్ గోపాల్ వర్మ ఆసక్తికర వ్యాఖ్యలు



దివంగత మేటి నటి శ్రీదేవి జీవిత చరిత్ర ఆధారంగా వస్తున్న 'ది ఎంప్రెస్' పుస్తకంలో తాను ఒక అధ్యాయం రాసినట్లు సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ధ్రువీకరించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, పుస్తకంలో తాను రాసిన అధ్యాయమే అత్యుత్తమంగా ఉందని ప్రచురణకర్తలు తనకు చెప్పారని, అయితే బహుశా ఆ పుస్తక రచనలో సహకరించిన ప్రతి ఒక్కరితోనూ వారు అలాగే చెప్పి ఉండవచ్చని వర్మ తనదైన శైలిలో చమత్కరించారు. శ్రీదేవితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, "ఆమెతో పనిచేయడం ఒక సెవెన్ స్టార్ హోటల్‌లో ఉన్నట్లుండేది. జీవితాంతం ఆ అనుభూతిని మర్చిపోలేం. ప్రతి సన్నివేశానికి ఆమె 15 నుంచి 20 రకాల హావభావాలను ప్రదర్శించేవారు. 'మిస్టర్ ఇండియా'లోని చార్లీ చాప్లిన్ సన్నివేశంలో ఆమె నటనను ఇప్పటికీ నేను అర్థం చేసుకోలేకపోతున్నాను" అని రామ్ గోపాల్ వర్మ ప్రశంసించారు. తాను ఇప్పటివరకు దర్శకత్వం వహించిన నటీనటులందరిలో శ్రీదేవి అత్యంత అద్భుతమైన నటి అని ఆయన కొనియాడారు. పుస్తకానికి 'ది ఎంప్రెస్' అని పేరు నిర్ణయించినట్లు తనకు తెలియదని, అయితే ఆ బిరుదుకు ఆమె అన్ని విధాలా అర్హురాలని వర్మ పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తాను మాత్రం ఆమెను 'స్క్రీన్ క్వీన్' అని పిలవడానికే ఇష్టపడతానని తెలిపారు. శ్రీదేవి జయంతి రోజున ఆమెను గుర్తు చేసుకుంటారా అని అడగ్గా, "లేదు! చనిపోయిన వారి గురించి నేను అస్సలు ఆలోచించను. వారు వెళ్లిపోయాక నా జీవితంలో ఉండరు. నేను ఎల్లప్పుడూ నా భవిష్యత్తుపైనే దృష్టి పెడతాను. ప్రస్తుతం హర్షవర్ధన్ రాణే కథానాయకుడిగా 'పోలీస్ కంపెనీ' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నాను" అని స్పష్టం చేశారు. అయితే, గతంలో చెన్నైలో శ్రీదేవిని మొదటిసారి కలిసిన సందర్భాన్ని ఆయన నెమరువేసుకున్నారు. "ఆమె గదిలోకి వచ్చిన ప్రతిసారీ, ఏదో స్వచ్ఛమైన గాలి వీచినట్లు అనిపించేది. అటువంటి అద్భుతమైన వ్యక్తి నిజంగానే ఈ ప్రపంచంలో ఉండేవారని మానవాళికి తెలియజేయడం కోసం, ఆమె ఒక్కసారి భూమిపైకి తిరిగి రావాలని కోరుకుంటున్నాను" అంటూ రామ్ గోపాల్ వర్మ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు.

# అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!



**'మిరాయ్'తో మెప్పించిన రితికా-బలమైన కథ కోసమే తీసుకున్న గ్యాప్**

**'కొరియన్ కనకరాజు'తో భారీ హిట్-మరిన్ని అవకాశాలతో దూసుకుపోయే ఛాన్స్**

ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.

# సినీ ప్రేమికులు తప్పక చూడాల్సిన సినిమా ఇది: అల్లు అర్జున్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ఇటీవల విడుదలైన తమిళ థ్రిల్లర్ 'డిసి' సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ చిత్రాన్ని ఒక 'తమిళ క్లాసిక్'గా అభివర్ణిస్తూ, ప్రతీ సినిమా ప్రేమికుడు తప్పక చూడాల్సిన కళాఖండం అని సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఆయన తాజా రివ్యూ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. "'డిసి' చూశాను! ఇదొక తమిళ క్లాసిక్. ప్రతీ సినిమా ప్రేమికుడు తప్పక చూడాలి. దీన్ని అర్థం చేసుకున్న వారికి ఇది ఒక కవిత్వం లాంటిది" అంటూ అల్లు అర్జున్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. చిత్ర బృందానికి అభినందనలు తెలుపుతూ, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్‌కు తన అత్యున్నత గౌరవాన్ని తెలియజేశారు. రాకీ, సాని కాయిధమ్, కెప్టెన్ మిల్లర్ వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అరుణ్ పనితనాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. సినిమాకు తన సంగీతంతో ప్రాణం పోసిన అనిరుధ్ రవిచందర్‌ను 'అబ్సొల్యూట్ మాస్టర్ బూస్టర్' అని పొగిడిన బన్నీ, సాంకేతికంగా సినిమా అత్యున్నత స్థాయిలో ఉందని అన్నారు. ఇక ఈ చిత్రంలో కథానాయకుడిగా నటించిన ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌ను 'ప్రాజెక్ట్‌కు అతిపెద్ద ఆధారం' అని అభివర్ణించారు. ఆ పాత్రలో లోకేశ్ జీవించారని ప్రశంసించారు. కథానాయిక వామికా గబ్బితో పాటు ఇతర నటీనటులందరూ అద్భుతంగా నటించారని తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ట్రెండ్ అవుతున్న ఈ సినిమాకు అల్లు అర్జున్ రివ్యూ మరింత బూస్ట్ ఇచ్చింది. ఇప్పటికే ఈ సినిమాను సూపర్ స్టార్ మహేశ్ బాబు కూడా మెచ్చుకున్న సంగతి తెలిసిందే. కాగా, అల్లు అర్జున్ తన తదుపరి చిత్రం 'రాకా' (దర్శకుడు అట్లీ) తర్వాత లోకేశ్ కనగరాజ్‌తో ఒక సినిమా చేసే అవకాశం ఉందంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో లోకేశ్ నటనను బన్నీ ప్రత్యేకంగా ప్రశంసించడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం, అల్లు అర్జున్ రివ్యూతో తెలుగు ప్రేక్షకుల్లో కూడా ఆసక్తిని పెంచింది.



# సుతార్, జడేజా స్పిన్ ధాటికి లంక విలవిల..
# భారత్‌కు 178 పరుగుల ఆధిక్యం






గాలేలో శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు పట్టు బిగించింది. యువ స్పిన్నర్ మానవ్ సుతార్, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్పిన్ మాయాజాలంతో మూడో రోజు శ్రీలంకను తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో భారత్‌కు 178 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. సోనల్ దినూష (100) అద్భుతమైన సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా జట్టును ఆదుకోలేకపోయాడు. వర్షం కారణంగా సోమవారం ఆటను ముందుగానే నిలిపివేశారు. అంతకుముందు, ఉదయం 462 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను ముగించిన భారత్, బౌలింగ్‌లోనూ ఆది నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. మహమ్మద్ సిరాజ్ తాను వేసిన రెండో బంతికే ఓపెనర్ మదుష్కను డకౌట్ చేశాడు. ఆ తర్వాత స్పిన్నర్లు రంగంలోకి దిగారు. ఈ పర్యటనపై భారీ అంచనాలతో వచ్చిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్, తాను వేసిన తొలి బంతికే దినేశ్ చండీమల్‌ను ఔట్ చేసి సత్తా చాటాడు. పదునైన బంతులతో టర్న్, బౌన్స్ రాబట్టిన సుతార్ మొత్తం 4 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు రవీంద్ర జడేజా 3 వికెట్లతో రాణించి, టెస్టు క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలో వికెట్ పంచుకున్నారు. ఒక దశలో 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి శ్రీలంక ఫాలోఆన్ ముంగిట నిలిచింది. ఈ క్లిష్ట సమయంలో సోనల్ దినూష, నిరోషన్ డిక్వెల్లా (80) అద్భుతంగా పోరాడారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. దాదాపు మూడేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన డిక్వెల్లా అర్ధశతకంతో ఆకట్టుకోగా, దినూష తన అరంగేట్ర సెంచరీతో మెరిశాడు. అయితే, 80 పరుగులు చేసిన డిక్వెల్లాను ప్రసిద్ధ్ కృష్ణ ఔట్ చేయడంతో ఈ భాగస్వామ్యం విడిపోయింది. ఆ తర్వాత లంక ఇన్నింగ్స్ మళ్లీ పేకమేడలా కూలింది. చివరి 5 వికెట్లను కేవలం 50 పరుగుల తేడాతో కోల్పోయింది. దినూష శతకం పూర్తి చేసుకున్న వెంటనే జడేజా అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది.



# వాట్ ఏ క్యాచ్..
# గాల్లో పక్షిలా ఎగిరిన గిల్.. వీడియో వైరల్!

గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజు ఆటలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అద్భుతమైన ఫీల్డింగ్‌తో అందరినీ మంత్రముగ్ధులను చేశాడు. ఎక్స్‌ట్రా కవర్ ఫీల్డింగ్ చేస్తున్న గిల్, గాల్లోకి పక్షిలా ఎగిరి అసాధారణ రీతిలో అందుకున్న క్యాచ్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో శ్రీలంక బ్యాటర్ కమిందు మెండిస్ క్రీజు వదిలి ముందుకు వచ్చి బంతిని డ్రైవ్ చేశాడు. బంతి వేగంగా నేలను తాకడానికి సిద్ధమవుతున్న తరుణంలో గిల్ తన ఎడమవైపునకు పూర్తిగా డైవ్ చేసి గాల్లోనే బంతిని ఒడిసిపట్టాడు. బంతి చేజారకుండా నేలకు తాకకుండా పట్టుకున్న తీరు అద్భుతం. ఈ క్యాచ్ చూసిన కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. "వావ్, ఆ క్యాచ్ పట్టడానికి అతనికి ఎలాంటి అవకాశం లేదు. నిజానికి అది అతనికి అందే దూరంలోనే లేదు. బ్యాటర్ కూడా బంతి గాల్లోకి లేచింది కానీ సురక్షితమే అనుకుని ఉంటాడు. ఆ ప్రాంతంలో మీరు చూసే అత్యుత్తమ క్యాచ్‌లలో ఇది ఒకటి" అని ప్రశంసించాడు. ఇక, ఈరోజు భారత తొలి ఇన్నింగ్స్ అత్యంత వేగంగా ముగిసింది. ఆట ప్రారంభమైన కేవలం నాలుగు బంతుల్లోనే శ్రీలంక పేసర్ అసిత్ ఫెర్నాండో భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు. ఓవర్‌నైట్ స్కోరు 460/9తో బ్యాటింగ్ కొనసాగించిన భారత్.. ఆట మొదలైన మూడు నిమిషాల్లోనే ఇన్నింగ్స్ ముగిసింది. ఓవర్‌నైట్ స్కోర్‌కు కేవలం రెండు పరుగులు మాత్రమే జోడించి టీమిండియా తన చివరి వికెట్‌ను కూడా కోల్పోవడంతో భారత ఇన్నింగ్స్ 462 పరుగుల వద్ద ముగిసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక జట్టుకు ఆరంభం నుంచే భారత బౌలర్లు చుక్కలు చూపిస్తున్నారు. వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టడంతో భోజన విరామానికి ఆతిథ్య జట్టు 90 పరుగులకే కీలకమైన 5 వికెట్లు పారేసుకుంది.

# భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించాలి

- ఆత్మా శిక్షణలో రైతులకు ఎరువుల వినియోగం, శాస్త్రీయ సాగుపై అవగాహన
- సమతుల్య ఎరువుల వినియోగంతో భూసార పరిరక్షణ
- అధిక దిగుబడులు సాధించాలి
- ఆత్మా పథకం ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన
- ఏడీఏ నాగార్జునసాగర్

**నాయుడుపేట- సూర్య వాస్తవం:** ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామంలో ఆత్మా పథకం ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంలో సమగ్ర పంటల యాజమాన్యంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నాయుడుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు భూసార పరిరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, ప్రకృతి వ్యవసాయం, పంటల ఎంపిక, చీడపీడల నివారణ తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు నాగార్జునసాగర్ మాట్లాడుతూ వ్యవసాయంలో అధిక దిగుబడుల కోసం ఎరువులను విచక్షణారహితంగా వినియోగించడం కంటే, పంటకు అవసరమైన పోషకాలను శాస్త్రీయంగా గుర్తించి సరైన మోతాదులో అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఎరువులు ఎంత ఎక్కువగా వేస్తే అంత ఎక్కువ దిగుబడి వస్తుందనే అపోహను రైతులు వీడాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటకు అవసరమైన పోషకాలను గుర్తించి, వాటికి అనుగుణంగా ఎరువులను వినియోగిస్తే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు నేల సారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా పంట ఎదుగుదలకు అవసరమని తెలిపారు. ఒకే రకమైన రసాయన ఎరువులపై ఆధారపడకుండా సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా భూమిలో సేంద్రియ పదార్థం పెరుగుతుందని చెప్పారు. దీనివల్ల నేలలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి, పంటలు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పొందుతాయని పేర్కొన్నారు. రైతు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుందని, వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొంటూ రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక శాస్త్రీయ విధానాలను సమన్వయం చేసుకోవాలని నాగార్జునసాగర్ సూచించారు. పంట సాగు ప్రారంభించే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం, సరైన సమయంలో విత్తనాలు వేయడం, నీటి వినియోగాన్ని పొదుపుగా నిర్వహించడం, పంటకు అవసరమైన సమయంలోనే ఎరువులు, పురుగుమందులు వినియోగించడం ద్వారా



సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆత్మా పథకం రైతులకు వ్యవసాయంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలు, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఎంతో ఉపయోగకరమైన వేదికగా నిలుస్తోందని ఆయన తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని నిపుణులు, వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని కోరారు. పంటల సాగులో ఎదురయ్యే సమ స్యలను స్వయంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయకుండా సమీపంలోని రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతంలో మార్పులను దృష్టిలో ఉంచుకుని రాబోయే రబీ సీజన్‌లో నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. వర్షాలు తక్కువగా నమోదయ్యే పరిస్థితులు ఉంటాయని వాతావరణ శాఖ సూచిస్తున్న నేపథ్యంలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ శాఖ సూచనలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. భూమి సారాన్ని కాపాడుకోవడంలో పచ్చిరొట్ట పంటలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్న ఆయన జీలగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి వాటిని నేలలో కలియదున్నడం ద్వారా సహజసిద్ధంగా భూసారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, పంటలకు అవసరమైన పోషకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా నిరాకరించడం కాకుండా, అవసరానికి అనుగుణంగా సమతుల్యంగా వినియోగిస్తూ సేంద్రియ విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి ఈఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ వరి పంటలో కనిపించే చీడపీడలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా పంట నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ తెగుళ్ల లక్షణాలను గుర్తించాలని, అవసరమైనప్పుడు మాత్రమే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పురుగుమందులను మోతాదుకు మించి వినియోగించడం వల్ల రైతులకు అదనపు ఖర్చుతో పాటు పర్యావరణానికి కూడా నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి వీర రాఘవులు మాట్లాడుతూ పంట పొలాల్లో సహజ పద్ధతుల ద్వారా చీడపీడలను నియంత్రించేందుకు ఉపయోగపడే విధానాలను వివరించారు. ముఖ్యంగా వరి పొలాల్లో లింగాకర్షక బుట్టలు, పసుపు అట్టలను ఏర్పాటు చేసే విధానం, వాటి ప్రయోజనాలను రైతులకు ప్రదర్శన ద్వారా వివరించారు. పంటలో పురుగుల ఉనికిని ముందుగానే గుర్తించి, వాటి తీవ్రత పెరగకముందే తగిన చర్యలు చేపట్టడం ద్వారా పురుగుమందుల వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలని అధికారులు సూచించారు. వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వీఏఏ దిన్‌దీప్, కర్రబల్లవోలు వీఏఏ రాజేష్, స్థానిక పశు సమర్థక సేఖ అధికారి సమీరా, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పుష్పలత, సాయిప్రియ, సుమతి, చెంచులక్ష్మి, ఏడుకొండలు, పలువురు రైతులు పాల్గొన్నారు.




## ఏఐకేఎస్ సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

- రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవోకి వినతి




**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం ముందు రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ రెడ్డి సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఇలప నాగేంద్రబాబులు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతాంగం పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నాయని ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఏమాత్రం అమలు జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రధానంగా సూళ్లూరుపేట రెవెన్యూ డివిషన్లో అనేక రైతాంగ సమస్యలు ఉన్నాయని బుచ్చినాయుడు కండిగ మండలం వి ఎస్ పురంలో సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వలేదని అలాగే సూళ్లూరుపేట రెవిన్యూ డివిజన్ పరిధిలో తెలుగు గంగ చీలు కాలువలను పూర్తి చేయాలని, ఆక్రమణలకు గురైన పంట కాలువలను వెలికితీయాలని కోరారు.దాదాపు 1500 ఎకరాల కు నకిలీ విత్తనాల ద్వారా రైతులు మూడు కోట్ల రూపాయల మేర నష్టపోతే వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులు ఇప్పటికీ కూడా వారికి తగిన నష్టపరిహారం అందించలేదని నష్టపోయిన రైతాంగం ఎదురుచూపులు తప్పడం లేదని ఇకనైనా బాధిత రైతాంగానికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దురాక్రమణ పాలైన నెర్రి కాలువ తన సహజ స్వరూపాన్ని కోల్పోయిందని, సాగునీరు ప్రవహించాల్సిన నెర్రి కాలువలో మురుగునీరు ప్రవహిస్తుందని కాలువ ఆక్రమణలను తొలగించి పరిశుభ్రమైన సాగునీటిని రైతన్నలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రమణయ్య శ్రీనివాసులు,ఆనంద్ బాబు ఓ కుమార్ బాలు రజిని చంచమ్మ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## మన్నెముత్తేరి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఆరుగురు అరెస్ట్
- రూ.19,000 నగదు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.
- తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల కఠిన చర్యలు
- జూదం,పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు జిల్లాలో పేకాట,జూదం,ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సుళ్లూరుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెముత్తేరి గ్రామంలో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై ఎస్ఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో వెళ్లి దాడి నిర్వహించారు.పోలీసుల దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి పేకాటకు సంబంధించిన రూ. 19,000 నగదు, అలాగే 3 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పేకాట,జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేశారు.ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, సమాచారం అందిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలు పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తిరుపతి జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసారు.

## రెండు రోజుల్లోనే సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు

- విన్నవించిన వెంటనే స్పందన..
- ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్




**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** ధర్మవరం శారదానగర్‌కు చెందిన పోలా లక్ష్మీ రంగయ్య ఈ నెల 14వ తేదీన ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ని కలిసి తమ పరిస్థితిని వివరించారు.వారి పరిస్థితిని తెలుసుకున్న మంత్రి సత్య కుమార్ వెంటనే స్పందించి, సీఎంఆర్ఎఫ్ ద్వారా చికిత్సకు అవసరమైన రూ. 2,01,460 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి)ను కేవలం రెండు రోజుల్లోనే మంజూరు చేయించారు సోమవారం ఆ ఎల్ఓసీని ఆ కుటుంబానికి అందజేశారు.ఇది ఒక్కసారి చేసిన సహాయం కాదు...ఇటీవల ఇదే కుటుంబానికి చెందిన వారి కుమారుడు నారాయణస్వామి అనారోగ్యానికి గురైన సమయంలో కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించి,సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్ఓసీ మంజూరు చేయించి అవసరమైన ఆపరేషన్ జరిగేలా అండగా నిలిచారు.ఆపదలో ఉన్న కుటుంబం ఒక్కసారి కాదు ఎన్నిసార్లు వచ్చినా అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ.డబ్బుల కొరతతో ఏ ఒక్కరి వైద్యం ఆగకూడదనే సంకల్పంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ అందిస్తున్న సహాయం,స్పందనకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.ప్రజల ఆరోగ్యం మంత్రి బాధ్యత ఆపదలో అండగా నిలవడం ప్రజాసేవకు నిదర్శనం.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )